సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం : 8 : డిసెంబర్ : 2023



..ఐదేళ్ల వరకు భద్రం

వీవీప్యాట్ల స్లిప్పులు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లను ఐదేళ్ల వరకు భద్రపరుస్తారు.

వివరాలు 8లో ▸



ఆయకట్టు ఆగమాగం

కేఎల్ఐ ఆయకట్టుకు సాగునీటి విడుదల నిలిచిపోవడంతో ప్రశ్నార్థకంగా మారింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.8 /19.4

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి. చిరుజల్లులు కురవొచ్చు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన ఖోఖో జట్టు



కందనూలు: నిజామాబాద్ జిల్లాలోని నంది పేట్‌లో శుక్రవారం ప్రారంభమయ్యే 42వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాల, బాలికల ఖోఖో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడానికి గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో జట్టు క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. గురువారం జిల్లాకేంద్రంలోని గీతాంజలి పాఠశాలలో కోచింగ్ క్యాంపు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్ మాట్లాడుతూ మంచి నైపుణ్యం ఉన్న కోచ్‌తో మెలకువలు నేర్చుకొని రాష్ట్రస్థాయిలో ప్రదర్శించి ఉమ్మడి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని చెప్పారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఇన్‌చార్జ్ నిరంజన్‌యాదవ్ మాట్లాడుతూ ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపులో 18 మంది బాలికలు, 18 మంది బాలురకు శిక్షణ ఇచ్చామన్నారు. వీరిలో ప్రతిభకనబరిచిన బాలికలు 15 మంది, బాలురు 15 మంది చొప్పున ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పీసీ కోఆర్డినేటర్ ప్రసాద్‌గౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్, మాజీ కార్యదర్శి వెంకటయ్య, జిల్లా క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు రాజయ్య, శేఖర్, రాజేష్, జిల్లా ఖోఖో అసోసియేషన్ ఇన్‌చార్జ్ రమేష్ పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాలుర, బాలికల ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి 10 బాలుర జట్లు, 10 బాలికల జట్లు 400 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు రోజుల పాటు టోర్నీ కొనసాగనుంది. బాలురకు స్థానిక సెయింట్‌పాల్ స్కూల్‌లో, బాలికలకు సెయింట్ ఆగ్నేస్ స్కూల్‌లో బస ఏర్పాటు చేశారు.

హామీలు నెరవేర్చాలి

కందనూలు: నూతన ప్రభుత్వం విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి.. మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, శ్రీధర్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గానికి వారు శుభాకాంక్షలు చెప్పారు. కొత్త ప్రభుత్వం విద్యా రంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ.. విద్యారంగంలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని నివారించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను త్వరగా అమలు చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నయ్య, శంకర్, జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి, కోశాధికారి బాలరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులు కోరారు.

● ..అనే నేను

సీఎంగా రేవంత్.. మంత్రిగా జూపల్లి ప్రమాణ స్వీకారం

పులకించిన పాలమూరు

- ఉమ్మడి జిల్లాకు దక్కిన రాష్ట్ర అత్యున్నత పదవి
- కేబినెట్ మంత్రిగా జూపల్లి కృష్ణారావుకు అవకాశం
- ప్రజల్లో హర్షాతిరేకాలు.. హస్తం శ్రేణుల సంబరాలు
- మలి విడతలో ప్రభుత్వ విప్‌గా ఒకరికి చాన్స్?

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

పాలమూరు కీర్తి పతాకం మరోసారి రెపరెపలాడింది. ఉమ్మడి జిల్లాకు చెందిన టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర అత్యున్నత పదవి చేపట్టారు. 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో అవిభాజ్య మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బూర్గుల రామకృష్ణారావు సీఎంగా పనిచేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇదే జిల్లాలో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అంతేకాదు.. ఆయన మంత్రివర్గంలో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు చోటు దక్కింది. ఆయన సైతం మంత్రిగా ప్రమాణం చేశారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు పెద్దపీట దక్కడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా.. కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి.

బ్యాంక్ ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి..



కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన జూపల్లి కృష్ణారావు హైదరాబాద్‌లోని ఎస్‌బీహెచ్‌లో ఉద్యోగం చేసేవారు. 1999లో కొలువుకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కొల్లాపూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2004లో పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని టీఆర్‌ఎస్‌కు కేటాయిస్తే, జూపల్లి స్వతంత్ర అభ్యర్థిగా విమానం గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో వివిధ శాఖలకు మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011 అక్టోబరు 30న కాంగ్రెస్‌ను వీడారు. మంత్రి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్)లో చేరారు. 2012 ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచి కేసీఆర్ తొలి కేబినెట్‌లో తొలుత ఐటీ, భారీ పరిశ్రమల శాఖ, ఆ తర్వాత పంచాయతీ రాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత క్రమంలో బీరం బీఆర్‌ఎస్‌లో చేరగా.. జూపల్లికి ప్రాధాన్యం తగ్గింది. దీంతో ఆయన కేసీఆర్‌తో విభేదించారు. ఈ క్రమంలో ఆయనపై బీఆర్‌ఎస్ సస్పెన్షన్ వేటు వేయగా.. ఈ ఏడాది ఆగస్టు మూడో తేదీన కాంగ్రెస్‌లో చేరారు. తాజా ఎన్నికల్లో ఆరో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచి.. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒకట్రెండు రోజుల్లో ఆయనకు శాఖను కేటాయించే అవకాశం ఉంది. అయితే వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో జూపల్లికి మంత్రిగా అవకాశం రావడం విశేషం.



ఎన్నో ఆశలు..

ఉమ్మడి పాలమూరుకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆయనపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా పాలమూరు–రంగారెడ్డి, ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులు వేగంగా పూర్తి చేసి.. చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలని కోరుతున్నారు. అదేవిధంగా నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల రైతాంగానికి సాగు నీరందించి, ప్రయోజనం చేకూర్చే జీఓ 69 అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వీటితో పాటు ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీని జాప్యం చేయకుండా అమలు చేసి లబ్ధి చేకూర్చాలని విన్నవిస్తున్నారు.





చిన్నంబావిలో సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు

← ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మలివిడతలో అవకాశం దక్కేనా?

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌కు రాష్ట్ర అత్యున్నత పదవి లభించింది. అదేవిధంగా తొలివిడతలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కొల్లాపూర్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న జూపల్లికి మంత్రి వర్గంలో చోటుదక్కింది. ఈ క్రమంలో మలి విడతలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మరొకరికి రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. వీలు కాని పక్షంలో ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరిలో ఒకరిని తీసుకునే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా నుంచి ప్రమాణ స్వీకారానికి తరలిన హస్తం శ్రేణులు..

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి వాసులు, రేవంత్ స్నేహితులు, ఆయన అభిమానులు భారీ ఎత్తున తరలివెళ్లారు. అదేవిధంగా రేవంత్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మద్దూరు మండలాల నుంచి హస్తం నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు.

మొరాయిస్తున్న బస్సులు



ఉప్పునుంతల సమీపంలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

అచ్చంపేట రూరల్: నల్లమలలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు తరుచుగా మొరాయిస్తున్నాయి. మరోపక్క కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పడంతో ఈ ప్రాంతంలో ఇలాంటి బస్సులతో ఎలా సాధ్యమని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసం సీఎం రేవంత్‌రెడ్డి సమీప గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో మహిళలు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందిపడిన సంఘటన చోటు చేసుకుంది. అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును అధికారులు ఉప్పునుంతల మీదుగా కాంసానిపల్లి, తిర్మలాపూర్ వరకు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు నడిపిస్తున్నారు. కాగా గురువారం ఉదయం 8 గంటలకు ఆ గ్రామాలకు రావాల్సిన ఆర్టీసీ బస్సు మార్గమధ్యలోనే మొరాయించింది. సాయంత్రం రావాల్సిన బస్సు టైర్ పంచర్ అయ్యిందని ఉప్పునుంతల వరకు మాత్రమే వచ్చి వెళ్లడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి 7 తర్వాత కల్వకుర్తి డిపోకు చెందిన బస్సులో విద్యార్థులు గ్రామాలకు చేరారు. ప్రతినెలా అచ్చంపేట ఆర్టీసీ డిపోకు బస్‌పాస్‌కు సంబంధించిన డబ్బులు చెల్లిస్తున్నా.. డిపో అధికారులు పట్టించుకోవడం లేదని.. కల్వకుర్తి ఆర్టీసీ డిపో అధికారులు బస్సులు క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ నడిపిస్తున్నారని విద్యార్థులు చెప్పారు. ఇప్పటికైనా అచ్చంపేట ఆర్టీసీ డిపో అధికారులు ఈ రూట్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులు, ప్రయాణికులు, మహిళలు కోరుతున్నారు. ఈ విషయమై అచ్చంపేట ఆర్టీసీ డీఎం మురళి దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా మరోసారి అంతరాయం కలగకుండా చూస్తామని, కండీషన్ బస్సులు నడిపిస్తామని చెప్పారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

కొల్లాపూర్: ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమవంతుగా కృషిచేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని చెప్పారు. ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష జరుపుకొని, భవిష్యత్ కార్యాచరణపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎన్నికల్లో ఓడినంత మాత్రాన వెనకడుగు వేసేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రమేష్, శేఖర్‌గౌడ్, రోజారమణి, రామన్‌గౌడ్, మహేష్, సాయికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

పాఠ్యపుస్తకానికి అనుసంధానంగా బోధన

కల్వకుర్తి టౌన్: ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్య పుస్తకానికి అనుసంధానంగా బోధించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన పర్యవేక్షించారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో అనుసరించాల్సిన బోధనా పద్ధతులు, బోధనోపకరణాలను తయారు చేసుకొని ప్రదర్శనగా ఉంచాలన్నారు. నూతన బోధనా పద్ధతులను మెరుగుపరచడానికి కాంప్లెక్స్ సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉత్తమ విద్యా బోధన ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు ప్రణాళికాబద్ధంగా బోధించాలని, అందుకు అవసరమైన టీఎల్ఎం, లెసన్ ప్లాన్, వార్షిక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. తొలిమెట్టు ద్వారా ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించే నెలవారీ పరీక్షల వివరాలను డీఈఓ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా వారి హాజరును తీసుకోవాలన్నారు. పాఠశాలలకు నిత్యం గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఎంఈఓ బాసునాయక్, హెచ్ఎం ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన వారితో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

వన్నె తగ్గిన తెల్ల బంగారం

- వర్షాభావం, తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- జిల్లాలో సీసీఐ కేంద్రాలు లేక దక్కని 'మద్దతు'
- ధర లేక నష్టపోతున్న రైతులు
- క్వింటాకు రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్

అచ్చంపేట: పత్తికి ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఒకపక్క పంటలకు పెట్టుబడులు ఎక్కువై ఇబ్బందులు పడుతున్న రైతులు.. కనీసం మద్దతు ధర కూడా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 15రోజుల క్రితం క్వింటాకు రూ.7 వేలు పలికిన ధర.. రోజురోజుకు తగ్గిపోతుండటంతో రైతులకు నిరాశే ఎదురవుతుంది. పత్తికి ప్రభుత్వం రూ.7,020 మద్దతు ధర ప్రకటించగా.. ప్రైవేట్‌లో రూ.6,900 మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుదామంటే జిల్లాలో సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు.

ధరపైనే ఆశలు

గత సీజన్ ప్రారంభంలో పత్తి క్వింటాకు ప్రైవేట్‌లో రూ.9,400 వరకు పలికింది. సీజన్ మధ్యకు చేరుకునే వరకు ధరలు అమాంతం పడిపోయి రూ.7,400లకు చేరింది. దీంతో అధిక శాతం రైతులు దిగుబడులు విక్రయించకుండానే ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. నెలలు గడిచినా ఆశించిన పురోగతి లేకపోవడంతో రైతులంతా తక్కువ ధరకే పత్తి విక్రయించారు. రెండేళ్ల క్రితం 2021 సీజన్ ముగిసే సమయానికి రూ.11,500 నుంచి రూ.12 వేల వరకు ధర లభించింది. దీంతో గతేడాది రైతులంతా సీజన్ చివరి వరకు ఎదురుచూశారు. ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల యజమానులు ధర పెంచకపోవడంతో, సీసీఐ కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు మించి ధర చెల్లించలేదు. అధిక వర్షాలతో అరకొర వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో కనీసం ఈసారైనా పత్తికి గిట్టుబాటు ధర ఉండకపోతుందా.. అని ఆశగా రైతులు ఎదురుచూస్తున్నారు.



అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లిలో సాగు చేసిన పత్తి పంట

జిల్లా పరిధిలో ఇలా..

వానాకాలంలో జిల్లావ్యాప్తంగా రైతులు 4,40,253 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా.. పత్తి సుమారు 2.36 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి పత్తి సగటు దిగుబడి ఎకరాకు 8–12 క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా. వాతావరణం అనుకూలిస్తే కొన్ని మండలాల్లో ఎకరాకు 12– 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ లెక్కన సుమారు 28.32 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పత్తికి అనుకూల వాతావరణాలు లేకపోయాయి. అయితే మధ్యలో ఏకధాటిగా 29 రోజులపాటు వరుణుడు ముఖం చాటేయడంతో పత్తిలో ఆశించిన ఎదుగుదల లేక దిగుబడిపై కాస్త ప్రభావం చూపింది.

ఇళ్ల వద్దకు వచ్చి కొనుగోలు

ప్రైవేట్ వ్యాపారులు గ్రామాల్లో ఇళ్ల వద్దకు వచ్చి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వారు ఎంత ధర చెబితే అంతకు అమ్ముకుంటున్నారు. ముఖ్యంగా దళారులు వచ్చి కొనుగోలు చేస్తూ తర్వాత అమ్ముకొని లాభాలు గడిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర మంచిగా ఉండి సమీపంలో కొనుగోలు కేంద్రాలు ఉంటే రైతులకు మేలు జరుగుతుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తుంటారు. కానీ, పత్తికి మాత్రం కనీసం జిల్లాలో ఒక్కటి కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. నెల రోజులుగా పత్తితీత మొదలైనా.. జిల్లాలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటుకు నోచుకోలేకపోయాయి.

పెట్టుబడి కూడా రాలే..



గతేడాది 7 ఎకరాల్లో పత్తి సాగు చేస్తే 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పత్తికి ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ఈసారైనా ధర పెరుగుతుందనే ఆశతో 7 ఎకరాల్లో సాగు చేసిన. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా 10 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. కనీసం పెట్టుబడి దేవుడెరుగు.. కనీసం కూలీలు, ఎరువులు, మందుల ఖర్చులు కూడా రాలేదు. రైతులకు న్యాయం జరిగేలా పత్తికి ధర నిర్ణయించాలి.

– పుల్యానాయక్, గుట్టమీదితండా, ఉప్పునుంతల మండలం అమ్రాబాద్ మండలం

రూ.12 వేలు చెల్లించాలి



ఈ సీజన్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.12 వేల ధర చెల్లించాలి. గతేడాది ధర తక్కువ ఉండటంతో చాలా నష్టపోయాం. సీసీఐ కేంద్రాలు లేక ప్రైవేట్ వ్యక్తులకే అమ్ముకున్నాం. ప్రారంభంలో రూ.8,400 వరకు చెల్లించి ఆపై ధర తగ్గించారు. సీజన్ ముగిసే వరకు ధర పెంచకపోవడంతో నెలల తరబడి ఇంట్లోనే ఉంచుకున్నం. చివరకు తక్కువకే అమ్ముకున్న.

– బాలయ్య, జంగంరెడ్డిపల్లి,

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి. పెరిగిన కూలీల ధరలు, ఎరువులు, విత్తనాలు, మందుల ధరలకు అనుగుణంగా పత్తి ధర నిర్ణయించాలి. సీజన్ ప్రారంభంలో ఉన్న ధర స్థిరంగా ఉండేలా రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కనీసం ఈసారైనా రైతులు అప్పుల పాలు కాకుండా చూడాలి.

– అంబయ్య, తిర్మలాపూర్ (బికె), అమ్రాబాద్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


తిరుమలేష్ (ఫైల్)

గట్టు: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గట్టు మండలం మల్లంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మల్లంపల్లికి చెందిన తిరుమలేష్ (24) వ్యవసాయ పొలంలోని విద్యుత్ బోరుమోటర్ వద్ద వైర్లను సరి చేస్తుండగా, షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పోలీస్ ఉద్యోగం కోసం ప్రయత్నించగా.. ఒక్క మార్కు తేడాతో ఉద్యోగానికి దూరమైనట్లు గ్రామస్తులు తెలిపారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి తాయప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు పీయూ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఆలిండియా సౌత్ జోన్ పోటీలకు పీయూ అథ్లెటిక్స్ మహిళ, పురుషుల జట్లకు పీయూలో ఎంపికలు జరిగాయి. ఈ మేరకు పురుషుల జట్టులో 5 కి.మీ., విభాగంలో ఉషనప్ప, 10 కి.మీ., రాజేష్, లాంగ్‌జంప్‌లో శివకుమార్, షాట్‌పుట్‌లో సాయికిరణ్, డిస్కస్ త్రోలో రూప్‌సింగ్‌లను ఎంపిక చేయగా.. బాలికల విభాగంలో 5 కి.మీ., రాజేశ్వరి, 10 కి.మీ.,లో హైమావతి, షాట్‌పుట్‌లో రమ్యశ్రీ, జ్యోతిర్మయి, నందినిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, సునీల్, శ్వేత, చంద్రకళ, కవిత పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ విద్యార్థి బాలకృష్ణను ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ అభినందించారు. బాలకృష్ణ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ లండన్ వారు ఆన్‌లైన్‌లో పోస్టర్ ప్రజెంటేషన్‌ను 'నానోమెటీరియల్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో బహుమతి గెలుపొందాడు. జాతీయ స్థాయిలో బహుమతి రావడంపై కళాశాల అధ్యాపకులు శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్, అయేషా హష్మి, రవికుమార్, సిద్ధమారగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

పెంపుడు శునకానికి అంత్యక్రియలు



పాన్‌గల్: అనారోగ్యంతో మృతి చెందిన పెంపుడు శునకానికి యజమాని కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారం నిర్వహించి ప్రేమను చాటుకున్నారు. ఈ ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాన్‌గల్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆదాంరాజు పెంపుడు శునకం (లూసి) అనారోగ్యం బారిన పడటంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శునకం మృతి చెందగా.. స్వగ్రామానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

వైభవంగా కురుమూర్తి జాతర



చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తి స్వామి జాతర వైభవంగా కొనసాగుతుంది. గురువారం పాలమూరు నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు మెట్లపై గోవింద నామ స్మరణ చేస్తూ ముందుకు కదిలారు. అలివేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర మైదానంలోని దుకాణ సముదాయాల్లో వివిధ వస్తువులను కొనుగోలు చేశారు.

గోశాలకు గోవుల తరలింపు

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు స్వామివారికి కానుకగా సమర్పించిన గోవులను గురువారం హన్వాడ మండలం చిన్నదర్పల్లి గోశాలకు ఆటోలో తరలించారు. ఈ సందర్భంగా ఈఓ మదనేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గోవుల సంరక్షణ కోసం వాటిని గోశాలకు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివానందచారి, శ్రీకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



లెక్కింపు ముగిసినా..

ఐదేళ్ల వరకు భద్రంగా..



అచ్చంపేట: శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అయినప్పటికీ ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేల్చిన ఈవీఎంలను మాత్రం పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్‌రూంలలో భద్రపరించారు. వాటితో పాటు వీవీ ప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్లలోని స్లిప్పులు, మాక్ పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపరు తదితర ఎన్నికల సామగ్రి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయా రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి తాళాలు వేసి సీల్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని ఆయా జిల్లా కేంద్రాల్లో గోదాముల్లో భద్రపరిచారు. ఎన్నికలు ముగిసినా ఈవీఎంలు ఎందుకు భద్రపరుస్తారనే విషయం తెలుసుకుందాం.

స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట నిఘా

ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం అధికారులు స్ట్రాంగ్‌రూంలలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూంలను నిరంతరం పర్యవేక్షించటానికి సీసీ కెమెరాలతో పాటు కేంద్ర బలగాలు మోహరించారు. వాటిని తిరిగి ఎన్నికల సంఘానికి అప్పగించే వరకు జిల్లా ఎన్నికల అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

హోరాహోరీగా తలపడినప్పుడు..

అభ్యర్థుల మధ్య ఎన్నిక పోటాపోటీగా జరిగినప్పుడు గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల కంట్రోల్‌యూనిట్లు కీలకమవుతాయి. అతి తక్కవ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థులు ఎప్పుడైనా ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానాలకు వెళ్లవచ్చు. అలాంటి సందర్భాల్లో ఇవి కీలకం. దేవరకద్ర నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మధుసూధన్‌రెడ్డి 1,382 అతి తక్కవ మెజార్టీతో గెలిచారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి 5,248, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి 5,410, గద్వాల బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి 7,036, నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డికి 7,951, షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకరయ్యకు 7,128 ఓట్లు వచ్చాయి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో గెలిచిన అభ్యర్థుల మెజార్టీ భారీగా ఉండటంతో ఇక్కడ అలాంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశమే లేదంటున్నారు ఎన్నికల అధికారులు.

45రోజుల తర్వాత..

ఎన్నికల ఫలితాలు వెల్లడించిన 45రోజుల పాటు జిలా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈవీఎంలకు భద్రత కల్పిస్తారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు చేర్చుతారు. అక్కడ వాటిని ఐదేళ్ల పాటు భద్రపరుస్తారు. అనంతరం ఎన్నికల సంఘం నియమించిన ఇంజినీర్లు వచ్చి వాటిలోని డేటాను తొలగించి అవసరాన్ని బట్టి దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగితే అక్కడికి తీసుకెళ్లి ఉపయోగిస్తారు.

ఫిర్యాదు చేస్తే తక్షణ పరిష్కారానికి..

ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై పరాజితులు ఎప్పుడైనా ఫిర్యాదు చేసే అవకాశముంటుంది. ఓట్ల లెక్కింపు సమయంలో ఏమైనా అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు భావించి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయటానికి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. అలాంటప్పుడు ఏ నియోజకవర్గంలో ఫిర్యాదు అందితే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్‌లో ఓట్లను తక్షణమే లెక్కించటానికి వీలుగా అధికారులు ఈవీఎంలను భద్రపరుస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెరగాలి


మాట్లాడుతున్న డాక్టర్ జీవన్

పాలమూరు: గుండెపోటుతో అపస్మారక వెళ్లిన వారికి సీపీఆర్ చేసే విషయంలో ప్రధానంగా 8 రకాల ప్రధాన అంశాలపై దృష్టి పెట్టాలని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. తొలుత అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తిని సమాంతర ప్రదేశంపై పడుకోబెట్టాలన్నారు. మెడికల్ అత్యవసర రెస్పాన్స్ టీంకి సమాచారం ఇవ్వాలని, అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తిని కుడివైపు మోకాళ్లపై కూర్చొబెట్టి, శ్వాస, పల్స్‌ను బట్టి గుండెపోటును గుర్తించాలన్నారు. గుండెపోటు కలిగితే వెంటనే చెస్ట్ కంప్రెషన్స్ మొదలుపెట్టాలని, ప్రతి నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఐదు నుంచి ఆరు సెంటిమీటర్ల లోతుకు కంప్రెషన్స్ చేయాలన్నారు. ప్రతి 30 కంప్రెషన్స్‌కి ఒకసారి ఐదు నుంచి పది సెకండ్స్ నోటీ ద్వారా శ్వాసని ఇవ్వాలన్నారు. చెస్ట్ కంప్రెషన్స్‌కి పది సెకన్లకు మించి అంతరాయం కలగరాదన్నారు. అందుబాటులో ఉంటే ఏఈడీ మిషన్‌ను ఉపయోగించాలని, ఈ ప్రక్రియ మెడికల్ కేర్ టీం వచ్చే వరకు చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రొఫెసర్ అమరావతి, వైద్యులు నజ్మా, వంశీకృష్ణ, అలీఖాన్, ఆర్‌ఎంవోలు దుర్గా, శ్వేత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు నిలిపి

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన వైద్యురాలు


ప్రయాణికుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

బల్మూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు అస్వస్థతకు గురి కాగా.. ఓ డాక్టర్ సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్‌కు బయల్దేరిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు ఎక్కాడు. బల్మూర్ మండలం మహదేవ్‌పూర్ స్టేజీ సమీపంలో అతడు తీవ్ర అస్వస్థతకు లోనై గుండెపోటుకు గురికాగా.. అదే బస్సులో ప్రయాణిస్తున్న మాధవరం పల్లె దవాఖాన డాక్టర్ నందిని గమనించి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం అతడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ప్రయాణికుడి ప్రాణాలను కాపాడిన డాక్టర్‌ను తోటి ప్రయాణికులు అభినందించారు. సహకరించిన బస్సు డ్రైవర్, కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ఆటోలు, స్కూటీకి నిప్పు


ధర్మాపురంలో తగులబడిన ఆటోలను పరిశీలిస్తున్న పోలీసులు

అమరచింత: ఇంటి ఎదుట నిలిపిన రెండు ఆటోలతో పాటు ఒక స్కూటీకి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని ధర్మాపురంలో కలకలం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. ధర్మాపురం గ్రామానికి చెందిన సోమన్న హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల కిందట కురుమూర్తి జాతర కోసం ఆటో తీసుకుని స్వగ్రామానికి వచ్చాడు. సోమన్న తమ్ముడు గోపి అమరచింత, ఆత్మకూర్ గ్రామాలకు ప్యాసింజర్ ఆటో నడుపుతూ గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. గురువారం ఇరువురు కుటుంబ సభ్యులతో కలిసి కురుమూర్తి జాతరకు వెళ్లి వచ్చారు. తమ ఇంటి ఎదుట ఆటోలతో పాటు స్కూటీని నిలిపి ఉంచగా.. అర్ధరాత్రి గుర్తుతెలియని దండగులు ఇంటి తలుపులకు గడియపెట్టి ఆటోలపై డీజిల్, గడ్డి చల్లి తగులబెట్టారు. రెండు ఆటోలతో పాటు స్కూటీ పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ రత్నం ఘటనా స్థలాన్ని చేరుకుని వివరాలను సేకరించా రు. క్లూస్ టీంను పిలిపించి దర్యాప్తు చేపట్టారు. త్వ రలోనే నిందితులను గుర్తిస్తామని సీఐ తెలిపారు.

దాయాదులపైనే అనుమానం..

భూవివాదంపై తమ దాయాదులతో గొడవలు ఉన్నాయని బాధితులు సోమన్న, గోపి పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొన్నేళ్లుగా జరుగుతున్న గొడవను మనసులో పెట్టుకుని తమ జీవనాధారమైన ఆటోలను తగులబెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

ప్రమాదం అని తెలిసినా..


దేవరకద్రలో గేటు మూయడం వల్ల పట్టాలు దాటుతున్న వృద్ధులు

● పట్టాలు దాటుతున్న ప్రజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని రైల్వే గేటు మూసివేయడంతో ప్రజలు తప్పని సరి పరిస్థితుల్లో రైల్వే పట్టాలను దాటుతున్నారు. ప్రమాదం అని తెలిసినా ప్రభుత్వ కార్యాలయాలు, సంతలో సరుకులు కొనడానికి ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు రైల్వే పట్టాలు దాటి పోక తప్పడం లేదు. కాగా ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా.. వేగంగా వచ్చే రైళ్ల వల్ల ప్రమాదం పొంచిఉందని పలువురు పేర్కొంటున్నారు. దేవరకద్రలో నిర్మించిన ఆర్వోబీ వల్ల రాయిచూర్, నారాయణపేట, మక్తల్, ఆత్మకూర్, మహబూబ్‌నగర్, హైదరబాద్ వంటి పట్టణాలకు నేరుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది లేకుండా వెళ్తున్నారని.. కానీ పట్టణంలోని ప్రజలు, ఇతర గ్రామాల నుంచి దేవరకద్రకు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, బుధవారం జరిగే సంతకు చుట్టు పక్కల నుంచి వచ్చే 40 గ్రామాల ప్రజలు గేటు మూయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు ఆలోచన లేకుండా తొందరపాటు నిర్ణయాల వల్ల పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు నిత్యం ఇలా రైల్వే పట్టాలను దాటాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. వృద్ధులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకూ ఇబ్బంది తప్పడం లేదని చెబుతున్నారు.

గేటు తెరిస్తే బస్టాండ్ కళకళలాడుతుంది

రైల్వే గేటు తెరిస్తే దేవరకద్ర బస్టాండ్ తిరిగి కళకళలాడే అవకాశం ఉంది. బస్సుల రాక పోకలతో పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపార కేంద్రాలన్ని తిరిగి పుంజుకునే అవకాశం ఉంది. ఇప్పటికే నిరాశతో ఉన్న వ్యాపారులు తమ వ్యాపారం తిరిగి కొనసాగించుకోడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇక గేటును తెరిచిన పెద్దగా ట్రాఫిక్ సమస్య ఉండదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ విషయంలో స్పందించి గేటు తెరిచేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రైలు వస్తుండగా రెండు వైపుల నిలబడ్డ ఇతర గ్రామాల ప్రజలు

మిరపలో సస్యరక్షణ అవసరం


మిరప పంట,మిరపకు కాయకుళ్లు తెగులు



అలంపూర్: మిరపలో సస్యరక్షణ చర్యలు అవసరమని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. ప్రస్తుతం మిరప పూత, కాయ దశలో ఉండటంతో వివిధ రకాల చీడ పీడలు ఆశించి పంటను నష్టపరుస్తున్నట్లు వివరిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో మిరప విస్తారంగా సాగులో ఉంది. మిరపలో ఆశిస్తున్న చీడలు, పురుగులు, వాటి నివారణను వ్యవసాయ ఏడీఏ ఈ విధంగా వివరిస్తున్నారు.

ఆకు ముడత

తామర పురుగు వలన ఆకు ముడత వ్యాపిస్తుంది. తామర పురుగులు ఆకు నుంచి రసం పీల్చడం వలన ఆకులు పైకి ముడుచుకునిపోతాయి. చివరకు ఇవి బోటు ఆకారంలోకి మారిపోతాయి. దీని వలన కిరణ జన్య సంయోగక క్రియ దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.

నివారణ

ముందుగా లేత ఆకులు వస్తున్నప్పుడు వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తర్వాత డైఫెంథురాన్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

కాయ తొలుచు పురుగు

కాయ తొలుచు పురుగు లద్దె పురుగులు మిరప కాయలపై చిన్న రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశించి లేత గింజలను తింటాయి. దీని వలన నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ

ఈ పురుగు నివారణకు క్లోరాంత్రినిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. లేదా వరి తౌడు 10 కిలోలు, బెల్ల పాకం 2 కిలోలు, థయోడికార్బ్ 500 గ్రాములు కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసి పొలంలో సాయంత్రం వేళల్లో చల్లితే

అధికారి సలహా
ఏడీఏ సక్రియ నాయక్

ఈ పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చును.

కాయ కుళ్లు తెగులు

ఈ తెగులు శిలీంధ్రం ఆశించడం వలన వస్తుంది. ఈ తెగులు మొదట చిన్నటి నల్లమచ్చలుగా కాయలపై వస్తోంది. తర్వాత కాయ మొత్తం నల్లగా మారి కుళ్లిపోతుంది.

నివారణ

ఈ కాయ కుళ్లు తెగులు నివారణకు డైఫెనకొనజోల్ ఒక మి.లీ. లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

ఆకు మచ్చ తెగులు

ఆకులపై చిన్న చిన్న మచ్చలు ఏర్పడుతాయి. ఈ మచ్చలు కలిసిపోయి ఆకులు రాలిపోతాయి. నివారణకు ఈ తెగులు నివారణకు సాఫ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

జింక్ లోపం

జింక్ ధాతువు లోపం వలన ఆకుల మధ్య ఈనెలు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. దీని వలన కిరణజన్య సంయోగక క్రియ పూర్తిగా దెబ్బతింటుంది. జింక్ ధాతువు లోపం ఎక్కువైతే ఆకులన్నీ రాలిపోతాయి. ఈ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

ఆయకట్టు ఆగమాగం


చొక్కన్నపల్లి వద్ద నీరు లేక వెలవెలబోతున్న కేఎల్‌ఐ డి-82 కాల్వ

● ఎంజీకేఎల్‌ఐ డి–82 కాల్వకు నిలిచిన సాగునీరు
● 1650 ఎకరాల్లో ఎండుముఖం పడుతున్న పంటలు
● ఆందోళనలో అన్నదాత

వెల్దండ: మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. పంట చేతికొచ్చే సమయంలో కాల్వలకు నీటి విడుదల నిలిచిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, గుండాల, వెల్దండ, చొక్కన్నపల్లి, బండోనిపల్లి, చెర్కూర్ తదితర గ్రామాల్లో రైతులు కేఎల్‌ఐ డి–82 కాల్వ నీటిపై ఆధారపడి వేరుశనగ తదితర పంటలను పెద్దఎత్తున సాగుచేశారు. రెండు నెలల కిందట కాల్వకు నీటి విడుదల నిలిచిపోవడం, ఇటీవల కాల్వ పూర్తిగా వట్టిపోవడంతో పంటలకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. దాదాపు 1650 ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట ఎండుముఖం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యయ ప్రయాసాలకోర్చి సాగుచేసిన పంటను ఎలాగైనా కాపాడుకోవాలని పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు బోరుబావులు తవ్విస్తున్నారు. మరికొందరు రైతులు పాత బోరుబావుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని పంటకు అందించి కాపాడుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సాగునీరందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

9ఎకరాల్లో పంటసాగు చేశాను..



కేఎల్‌ఐ కాల్వలో నీరు రావడంతో 9ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాను. ప్రస్తుతం కాల్వలో నీరు రావడం లేదు. పంటను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. పంట సాగుకు అప్పులు చేశాం. పంట ఎండిపోతే అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి కాల్వకు నీటిని విడుదల చేయాలి.

– రామకృష్ణ, రైతు, బండోనిపల్లి

ఇబ్బందులు పడుతున్నాం..



కేఎల్‌ఐ కాల్వలో నీరు రాకపోవడంతో పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడంలేదు. ప్రస్తుతం మూడు బోరు బావుల్లో ఉన్న కొద్దిపాటి నీళ్లను పంటకు అందిస్తున్నాం. తరచుగా మోటర్లు మరమ్మతులకు గురికావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– సుభాష్‌రెడ్డి, రైతు, చొక్కన్నపల్లి

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ


తలపడుతున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్లు

గద్వాల అర్బన్: గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్, సోమనాద్రి స్టేడియాల్లో ఎస్‌జీఎఫ్ 67వ రాష్ట్రస్థాయి అండర్–17 బాలుర క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. మూడవ రోజు గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో ఆయా జిల్లాల జట్లు పోటీపడ్డాయి. గ్రూప్–ఏలోని ఆదిలాబాద్ నాలుగు మ్యాచ్‌లు, మెదక్ జట్టు మూడు మ్యాచ్‌లు ఆడగా.. గ్రూపు–బీలోని రంగారెడ్డి, ఖమ్మం జట్లు మూడు మ్యాచ్‌లు ఆడి సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. శుక్రవారం సెమీఫైనల్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, పరిశీలకుడు సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, నాగేష్ బాబు, బీసన్న, రజినీకాంత్, రాజేంద్ర పాల్గొన్నారు.